క్లుప్తంగా

హోంమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి



మంత్రి వనితకు మద్దతుగా నినాదాలు చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): హోంమంత్రి తానేటి వనితపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ అన్నారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళిత మంత్రిపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం తగదని, దళిత సేన ఎప్పుడూ మంత్రి వనితకు అండగా నిలుస్తుందని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి గుంటూరు నవీన్ కుమార్, ఏలూరు జిల్లా మహిళా దళిత సేన అధ్యక్షురాలు బేతాళ జయసుధ, నాయకులు పింగుల ఇథియా, విజయమ్మ, లక్కపాము దాసు, సుజాత, బీసీ సెల్ అధ్యక్షురాలు పంజాగల రాటాలు పాల్గొన్నారు.

2న ఏఐటీయూసీ సమన్వయ కమిటీ సమావేశం

ఏలూరు (టూటౌన్): ఏఐటీయూసీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో డిసెంబరు 2న ఏలూరు స్ఫూర్తిభవన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు తెలిపారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ డిసెంబరు 9, 10 తేదీల్లో ఏలూరులో నిర్వహించే నేపథ్యంలో మహాసభల ఏర్పాట్లపైనా, నవంబరు 27, 28 తేదీల్లో విజయవాడలో జరిగిన కార్మిక, రైతు సంఘాల మహాధర్నాపై సమీక్షిస్తామని పేర్కొన్నారు.

నేడు వికసిత్ భారత్ సంకల్పయాత్ర

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో శుక్రవారం వివిధ మండలాల్లో నిర్వహించే వికసిత్ భారత్ సంకల్పయాత్ర వివరాలను జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిత్యం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు షెడ్యూల్లో తెలిపిన గ్రామాల్లో యాత్ర ప్రచార కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి రుణాల మంజూరుకు చర్యలు తీసుకుంటారని వివరించారు. శుక్రవారం భీమడోలు మండలం చెట్టున్నపాడు (ఉదయం), అగడాలంక (మధ్యాహ్నం), దెందులూరు మండలం ముప్పవరం (ఉదయం), శ్రీరామవరం(మధ్యాహ్నం), ద్వారకాతిరుమల మండలం ఐఎస్ రాఘవపురం (ఉదయం), జాజులకుంట (మధ్యాహ్నం), కామవరపుకోట మండలం వీరిశెట్టిగూడెం (ఉదయం), అడమిల్లి (మధ్యాహ్నం), ముదినేపల్లి మండలం చినకామనపూడి (ఉదయం), చిగురుకోటలో (మధ్యాహ్నం) నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేదల కుటుంబాల్లో సంతోషాల హరివిల్లు

ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల కుటుంబాల్లో ఆనందాల హరివిల్లు విరియాలనే ఆకాంక్షతో అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. 130వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం సాయంత్రం ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని 13, 15వ డివిజన్లలో కార్పొరేటర్ నిడికొండ అన్నపూర్ణ, పార్టీ యువజన నాయకులు నిడికొండ నరేంద్ర, కార్పొరేటర్ తంగెళ్ల రాము, పార్టీ నాయకులు రంగ ముత్యాలు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే నాని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలుపై ఆరా తీశారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రెండు డివిజన్లలోనూ వృద్ధులు, మహిళలు, చిన్నారులను ఆప్యాయంగా పలుకరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్లలో పేదలకు అండగా నిలబడ్డారని చెప్పారు. పెత్తందార్లు పేదలకు సంక్షేమ పథకాలు అందించటాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో జన్మభూమి కమిటీలు, టీడీపీ నాయకులు పేదలను దోచుకున్నారని, నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో అవినీతి రహిత పాలన చేస్తూ పేదలకు రూపాయి ఖర్చు లేకుండా సేవలు అందిస్తోందని వివరించారు. ఏలూరు నియోజకవర్గంలో ప్రతి పేదవానికీ ఇల్లు కల్పించే బాధ్యత తాము తీసుకున్నామని చెప్పారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ప్రజలంతా జగనన్నకు అండగా నిలవాలని కోరారు. సాంకేతిక లోపంతో పథకానికి దూరమైతే వాటిని పరిష్కరించి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వడ్డెరగూడెం అధ్యక్షుడు బత్తుల దుర్గారావు ఆధ్వర్యంలో సుమారు 40 మంది ప్రతిపక్ష పార్టీకి చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ కండువాలు కప్పిన ఎమ్మెల్యే నాని పార్టీలోకి సాదరంగా ఆహ్వానం పలికారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ, అవినీతి రహిత పాలనకు ఆకర్షితులమై పార్టీలో చేరామని వారంతా సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు, నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, తహసీల్దార్ సోమశేఖర్, కార్పొరేటర్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఉన్నారు.



వడ్డెరగూడెంలో ఎమ్మెల్యే నాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలు



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే నాని

అర్జీలకు సత్వర పరిష్కారం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను ప్రాధాన్యత క్రమంలో సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశించారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన గురువారం ప్రభుత్వ అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఏలూరులోని 21, 22 డివిజన్లలో ఇటీవల నిర్వహించిన గడపగడపకు కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన వినతులు, ఫిర్యాదులను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేలా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఏలూరు నగర పాలక సంస్థ అధికారులు, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు, పలు శాఖల అధికారులతో ఆయన ప్రజావినతులపై సమీక్షించారు. 21, 22 డివిజన్లలో సుమారు రూ.50 లక్షలతో పలు అభివృద్ధి పనుల ప్రతిపాదనలు ఆమోదించారు. త్వరలో పనులు ప్రారంభించేలా ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని, అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ నాయకులు అన్నపనేని రవికుమార్, నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ, తహసీల్దార్ సోమశేఖర్, ఎంహెచ్ఓ డాక్టర్ మాలతి, కార్పొరేటర్లు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

15న వాహనం వేలం

ఏలూరు(మెట్రో): జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో రహదారి ప్రయాణానికి అనువుగాని స్కార్పియో వాహనం వేలం నిర్వహిస్తున్నట్టు ప్రాజెక్టు డైరెక్టర్ అరవపల్లి రాము గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 15వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా నీటియాజమాన్య సంస్థ కార్యాలయం వద్ద బహిరంగ వేలం నిర్వహిస్తామని, పాటదారులు డిసెంబర్ 14లోగా కార్యాలయ ఏఓ ఎస్టాబ్లిస్‌మెంట్ సెక్షన్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలని, రూ.5 వేలు ధరావతు డిపాజిట్ చేయాలని పేర్కొన్నారు. వాహనం దక్కించుకున్న వారు 50 శాతం సొమ్ము, 18 శాతం జీఎస్టీ అప్పటికప్పుడు చెల్లించాలని తెలిపారు. స్క్రాప్‌గా అమ్మిన వాహనానికి సిబుక్ ఇవ్వడం జరగదని పేర్కొన్నారు.

హామీల్లో 98 శాతం అమలు జగన్ ఘనతే



47వ డివిజన్‌లో మాట్లాడుతున్న పార్టీ జిల్లా కోశాధికారి మైబాబు



17వ డివిజన్‌లో సంక్షేమ బోర్డును ఆవిష్కరించిన చంద్రశేఖర్, సదానందం

ఏలూరు టౌన్: ఎన్నికల హామీలను 98 శాతం అమలు చేసిన ఏకైక సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిలిచారని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా కోశాధికారి మంచెం మైబాబు అన్నారు. ఏలూరు నగరంలో 17, 47 డివిజన్లలో గురువారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ జెండాలను నేతలు ఆవిష్కరించారు. ఆయా డివిజన్లలో లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బోర్డులను ప్రారంభించారు. తంగెళ్లమూడిలో క్లస్టర్–3 అధ్యక్షులు మంచెం మైబాబు మాట్లాడుతూ రాజకీయ రంగంలో విలువలు, విశ్వసనీయతకు నిలువెత్తు నిదర్శనంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి నిలుస్తారన్నారు. చంద్రబాబు హయాంలో ఎన్నికల్లో హామీలు ఇవ్వటమే అమలుచేసిన దాఖలాలు లేవని ఆరోపించారు. ఏఎంసీ చైర్మన్ చిరంజీవులు మాట్లాడుతూ ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 17వ డివిజన్‌లో క్లస్టర్–1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలు అందిస్తుంటే శ్రీలంక అవుతుందని, ప్రజలు సోమరిపోతులు అవుతారంటూ విమర్శించిన చంద్రబాబు, లోకేష్‌లు నేడు అవే పథకాలను మరింత పెంచి ఎలా అమలు చేస్తారో ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమాల్లో నగర డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, క్లస్టర్–1 మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీదేవి, ఉపాధ్యక్షులు మంగమ్మ, విజయ్, జేసీఎస్ కన్వీనర్ మోటమర్రి సదానందకుమార్, పాము శామ్యూల్, మహిళా సమాఖ్య టూటౌన్ అధ్యక్షురాలు అమీనా అన్సారి, పార్టీ నాయకులు నున్న కిషోర్, సరిత, స్వర్ణలత, నాగేశ్వరరావు, చిట్టిబాబు, రవికుమార్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో జ్యోతిర్లింగార్చన



జ్యోతిర్లింగార్చన చేస్తున్న భక్తులు



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఆరుద్ర నక్షత్రం (మహాశివుని జన్మనక్షత్రం) సందర్భంగా నగరంలోని వివిధ శైవక్షేత్రాల్లో విశేష పూజలు చేశారు. స్థానిక పత్తేబాద శ్రీ చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఉదయం 11.16 గంటల నుంచి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి సహస్రనామ పూజలు, లక్ష బిల్వార్చన చేశారు. సాయంత్రం స్వామి వారికి విశేష అలంకరణ చేసి ఆలయ ప్రాంగణంలో జ్యోతిర్లింగార్చన అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. అర్చకుడు కొడమంచిలి లక్ష్మణ రావు విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి డి.శంకర రావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పవర్‌పేటలో..

కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 9 గంటల నుంచి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత గణపతి పూజ, మండపారాధన, అనంతరం లక్ష్మీగణపతి, నవగ్రహ, నక్షత్ర, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. మన్యు సూక్త సహిత మహారుద్ర హోమం వైభవంగా నిర్వహించారు. అర్చకులు కందుకూరి రామబ్రహ్మానంద శర్మ విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి ఎం రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	40	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	--	ములక్కాడలు	07-10
బెండకాయలు	32	కంద	60
పచ్చిమిర్చి	30	బీట్‌రూట్	40
కాకర కాయలు	28-32	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	40	అల్లం	120
క్యాబేజీ	22	కొత్తిమీర (కట్ట)	17
క్యారెట్	50	పాలకూర	10
దొండకాయలు	26	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	45-50	గోంగూర	06
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	44	బఠాణి	--
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	68
పొట్లకాయ(1)	15-20	చిలకదదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	36
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	15
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	21

ఎస్‌ఏఎస్‌కు ఘన నివాళి



కామేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఎస్‌ఏఎస్ కామేశ్వరరావు ఆత్మాహుతితోనే విద్యుత్ కార్మికులకు వేజ్‌బోర్డు స్కేల్స్ లభించిందని ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పి.సాల్మన్‌రాజు అన్నారు. ఎస్‌ఏఎస్ 50వ వర్ధంతి కార్యక్రమం గురువారం స్థానిక విద్యుత్ భవన్‌లో నిర్వహించారు. కార్యక్రమంలో సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యుత్ శాఖలో డ్రాఫ్ట్‌సమన్‌గా జీవితాన్ని ప్రారంభించిన ఎస్‌ఏఎస్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ కార్మికులను సంఘటితం చేశారని, ఆయన పోరాటాల ద్వారా కార్మికులకు ఎన్నో హక్కులు కలిగించారని వివరించారు. తొలుత ఎస్‌ఏఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ డీఈ టెక్నికల్ ఎం ఝాన్సీ, ఎస్ఏఓ కె.సత్యకిషోర్, విద్యుత్ ఉద్యోగుల సంఘాల నాయకులు భూక్యా నాగేశ్వరరావు, తురగా రామకృష్ణ, వి.రాము, ఎం రమేష్, సీహెచ్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని పవర్‌పేట 33/11 కేవీ ఏలూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో వెంకన్న చెరువు ఫీడర్‌కు విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించే నిమిత్తం శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. వంగాయగూడెం, కొబ్బరితోట, పడమర వీధి, సుబ్రహ్మణ్యం కాలనీ, రాజీవ్ గృహకల్ప, కైకలూరు రోడ్డు, గాంధీ కాలనీ, లక్ష్మమ్మ చెరువు గట్టు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

కొల్లేరును 3వ కాంటూరుకు కుదించాలి

ఏలూరు (టూటౌన్): కొల్లేరు పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటూనే, కొల్లేరును 3వ కాంటూరుకు కుదిస్తామని ప్రభుత్వాలు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వక్తలు పేర్కొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో పార్టీ స్థానిక జిల్లా కార్యాలయంలో కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్‌పై గురువారం రౌండ్ టేబుల్ సమావేశం సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ లింగరాజు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎ.రవి మాట్లాడుతూ కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్ పేరుతో కేంద్ర ప్రభుత్వం 5వ కాంటూరు పైన 10 కిలోమీటర్ల వరకు పర్యావరణం పేరుతో 26 నిబంధనలు పెట్టి వేలాదిమంది ప్రజల జీవితాలతో చెలగాట మాడుతుందని అన్నారు. దీంతో 5వ కాంటూరు పై ఉన్న 89 గ్రామాల ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెప్పారు. 3వ కాంటూరుకు కొల్లేరును కుదించాలని, కాలుష్యనివారణకు ప్రతిపాదిత రెగ్యులేటర్లు నిర్మించాలని, పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకుంటూనే కొల్లేరు ప్రజల ఉపాధిని కాపాడాలని, 22 వేల ఎకరాల ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని ఆయన కోరారు. జాతీయ మత్స్యకార సంఘం నాయకురాలు ఘంటసాల వెంకట లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బద్దా వెంకట్రావు మాట్లాడుతూ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు ప్రజానిర్ణయాలకు తలొగ్గాలన్నారు. గత ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయం ఫలితంగా ఇప్పటికే కొల్లేరు ప్రాంతంలో పేదలు, దళితులు ఇతర ప్రాంతాలకు ఉపాధి కోసం వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొల్లేరు ప్రజల ఉపాధి, రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు నేతల రమేష్‌బాబు, ఎంసీపీఐ (యు) జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు, నాయీబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర నాయకులు తాతపూడి చందు మాట్లాడారు. సమావేశంలో గిరిజన సంఘం జిల్లా నాయకులు టి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, పి.ఆదిశేషు, ఎం.నాగమణి, వి.సాయిబాబు, బి.జగన్నాథరావు పాల్గొన్నారు.



ఐక్యతను చాటుతున్న వివిధ పార్టీల నాయకులు

రేపు కొప్పులవెలమ సంఘం భవనానికి శంకుస్థాపన

ఏలూరు రూరల్ : ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని కొప్పులవెలమ సంఘీయుల కమ్యునిటీహాలు కోసం రూ.2 కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలం కేటాయించడం మరిచిపోలేమని వైఎస్సార్ సీపీ నాయకుడు ఘంటా ప్రసాద్ కొనియాడారు. గురువారం జంగారెడ్డిగూడెం రామన్నకోనేరు వద్ద కమ్యునిటీ హాలు స్థలం కొప్పులవెలమ సంఘం నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీన కొప్పులవెలమ సంఘీయుల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామన్నారు. గౌరవ అధ్యక్షుడు ఆళ్ల నాని సమక్షంలో జరిగే ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడు, ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యేలు ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్టు చెప్పారు. కార్యక్రమానికి సంఘీయులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. 1000 గజాల స్థలంలో రూ.3 కోట్లు వెచ్చించి, అన్ని వసతులతో భారీ భవనం నిర్మించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్పొరేటర్లు కిలాడి జ్యోతిదుర్గారావు, భీమవరపు హేమసురేష్, ఈదుపల్లి కళ్యాణి పవన్, కొరుపూరి సత్యవతినాగేశ్వరరావు, దేవరకొండ శ్రీనివాస్, గొర్రెల శ్రీను తదితరులు స్థల కేటాయింపునకు కృషి చేశారని తెలిపారు. సంఘ నాయకులు ఈడుపల్లి రంగారావు, లచ్చిరెడ్డి గోవిందరావు, మరడాని హిమబిందు, సీహెచ్ సూర్యనారాయణ, బళ్ల శివ, రెడ్డి ధనంజయ తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్ చూపుతున్న కొప్పులవెలమ సంఘం నాయకులు

సౌత్ జోన్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం ప్రతినిధులు

పెదవేగి : సౌత్ జోన్ మహిళల వాలీబాల్ పోటీలకు సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్, సెక్రెటరీ ఫాదర్ జి.మోజెస్ తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఫాదర్ మోజెస్ మాట్లాడుతూ విజయవాడ డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ డాక్టర్ ఈ.త్రిమూర్తి సారధ్యంలో ఆశ్రం కళాశాల ఫిజికల్ డైరెక్టర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ రాజు ఆధ్వర్యాన నిర్వహించిన సౌత్ జోన్ మహిళల వాలీబాల్ ఎంపిక పోటీల్లో తమ కళాశాల విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఇంటర్న్‌షిప్ చదువుతున్న ఎస్.తిరుమల, ఎల్.హర్షప్రియ, కేకేవీ సత్యలత, నాల్గో సంవత్సరం చదువుతున్న విద్యార్థి రమ్య శ్రీ ఎంపికైనట్లు ఫాదర్ మోజెస్ చెప్పారు. వీరు డిసెంబర్ 8 నుంచి 12వ తేదీ వరకు తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కళాశాల నందు జరిగే సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ ఎస్.స్లీవరాజు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్ నిట్టా నల్లయ్యను కళాశాల యాజమాన్యం అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.